## క్లుప్తంగా

### ల్యాప్‌టాప్ వితరణ



**అచ్చంపేట:** ప్రతిభ ఉండి ఆర్థికంగా వెనుకబడిన బీటెక్ విద్యార్థినికి మాగులూరి ఫౌండేషన్ ప్రతినిధులు శనివారం ప్రాజెక్టు వర్క్ నిమిత్తం ల్యాప్‌టాప్ అందజేశారు. అచ్చంపేటకు చెందిన పుసులూరి రాజేశ్వరి గుంటూరు ఎస్‌ఆర్‌ఐ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ రెండవ సంవత్సరం చదువుతోంది. మాగులూరి ఫౌండేషన్ నిర్వాహకులు భానుప్రకాశ్, ఆయన తండ్రి కృష్ణారావు, కుంచనపల్లి కిరణ్ రూ.40 వేలు విలువ చేసే ల్యాప్‌టాప్‌ను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో మండల టైలర్స్ అసోసియేషన్, మాగులూరి ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

### క్రీడలతో ఐక్యత



**పెదకూరపాడు:** క్రీడలతో ఐక్యత పెరుగుతుందని పెదకూరపాడు ఎస్‌ఐ విపర్ల వెంకట్రావు అన్నారు. స్థానిక కాకతీయ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో శనివారం నేహ్రూ యువ కేంద్రం సౌజన్యంతో జన చైతన్య సమితి ఆధ్వర్యంలో బ్లాక్ లెవెల్ ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వెంకట్రావు మాట్లాడుతూ క్రీడల్లో రాణించిన వారు ఉన్నత శిఖరాలకు చేరారని, సమష్టిగా రాణిస్తే విజయం తథ్యమన్నారు. కళాశాల ప్రిన్సిపల్ అశోక్‌బాబు మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలపై ఆసక్తి కలిగి ఉండాలన్నారు. పీఈటీ విజయకుమార్, వి.బాబు, జనచైతన్య సమితి కో–ఆర్డినేటర్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

### ఆదర్శ ప్రాయుడు కామ్రేడ్ బ్రహ్మయ్య

**అమరావతి:** కమ్యూనిస్టు సిద్ధాంత కోసం జీవితాంతం కట్టుబడిన కామ్రేడ్ తల్లం బ్రహ్మయ్య నేటి యువతకు ఆదర్శ ప్రాయుడని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక పార్టీ కార్యాలయంలో తల్లం బ్రహ్మయ్య సంస్మరణ సభలో పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఏరియా కమిటీ కార్యదర్శి బి.సూరిబాబు అధ్యక్షత వహించారు. వక్తలు కమ్యూనిస్టు విధానాల కోసం తల్లం బ్రహ్మయ్య కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గంజిమాల రవి, సయ్యద్ మొహిద్దీన్, బంగారయ్య, కాశీ విశ్వనాథం పాల్గొన్నారు.

# పారదర్శక వ్యవస్థల సృష్టికర్త జగన్

- చంద్రబాబు, జగనన్న పాలనను భేరీజు వేసుకోండి
- మేలు జరిగిందని నమ్మితేనే ఆశీర్వదించండి
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



సభలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు, పక్కన నాయకులు

**సత్తెనపల్లి:** పింఛన్‌లు, సంక్షేమ పథకాలు .. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల దోపిడీ నుంచి విముక్తి కల్పించేందుకే ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి సచివాలయం, వలంటీర్ల వంటి పారదర్శక వ్యవస్థలను సృష్టించారని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మండల పరిధిలోని కందులవారిపాలెం గ్రామంలో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రాల ప్రారంభోత్సవంలో శనివారం రాత్రి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ... చంద్రబాబు నాయుడు గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలమీ నెరవేర్చలేదని, ప్రజలను మోసం చేశాడని విమర్శించారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంకల్ప పాదయాత్ర సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారని గుర్తుచేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎంతమందితో కలిసొచ్చినా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కాలేడని, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని, ప్రజల ఆశీర్వాదంతో ఇది సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రంలో తనను, రోజాని, నానిని ఇంకొంతమందిని ఓడించడమే ప్రతిపక్షాలు లక్ష్యంగా చేసుకున్నాయన్నారు. అధికారం కోసం పదవులు మార్చే దుర్మార్గులు పోటీ చేస్తున్నారని, విధేయులు కావాలో విశ్వాస ఘాతకులు కావాలో ప్రజలు తేల్చుకొని ఓట్లు వేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలన్నారు. గుంటూరు ఏఎంసీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, ఇతర ప్రజా ప్రతినిధులు మాట్లాడారు. ముందుగా భారీ ర్యాలీతో మంత్రి అంబటి రాంబాబుకి స్థానిక నాయకులకు ఆత్మీయ స్వాగతం పలికారు. శాశ్వత భవనాల శిలాఫలకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా యూత్ అధ్యక్షుడు పదాల శివారెడ్డి, నియోజకవర్గ నాయకుడు సూరిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమ రావు, వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయభాస్కరరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలుకా జైపాల్, నాయకులు ఈవూరి బ్రహ్మారెడ్డి, నల్లబోతు శివనారాయణ, బూతుకూరి లక్ష్మీ, సర్పంచ్ బూతుకూరి చిన్న వెంకటరెడ్డి, బూతుకూరి లక్ష్మారెడ్డి, బూతుకూరి అంజిరెడ్డి, బూతుకూరి బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**నగరోత్సవంలో మంత్రి అంబటి పూజలు**

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని అచ్చంపేటరోడ్డులో గల శ్రీదుర్గా అన్నపూర్ణ సమేత శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి దేవాలయం నుంచి స్వామివారి నగరోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ ఊరేగింపులో స్వామి విగ్రహాలకు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పూజలు నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవం అనంతరం శనివారం జరిగిన కార్యక్రమంలో స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. పట్టణ, మున్సిపల్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల బాధ్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ ఉద్యోగం మానవత్వంతో కూడింది

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు దంపతులు
- ఉత్తమ సేవలు అందించిన కార్యకర్తలకు సన్మానం



ఎమ్మెల్యే శంకరరావు దంపతులను సన్మానిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

**క్రోసూరు:** అంగన్‌వాడీ ఉద్యోగం మానవత్వంతో కూడిందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. క్రోసూరు ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు శనివారం పోషణ్ పక్వాడ్ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, ఆయన సతీమణి వసంతకుమారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు చిన్న పిల్లలకు సేవలు అందించడం ఎంతో భాగ్యమన్నారు. మానవత్వంతో కూడిన విధులు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. వారి వేతనాలు పెంచేందుకు తన వంతు సహాయం అందిస్తామన్నారు. ఉత్తమ సేవలు అందించిన కార్యకర్తలను సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులను అంగన్‌వాడీ సిబ్బంది సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో స్వర్ణ, సూపర్ వైజర్లు షేక్ మున్నీ, షేక్ పెద్దహింమాంబి, మాణిక్యం, మాధవి, బాల త్రిపుర సుందరి, రత్నకుమారి, మొహబూన్నిసా, వనజ, భారతి పాల్గొన్నారు.

### పౌష్టికాహారం తీసుకోవాలి

**పెదకూరపాడు:** గర్భిణులు, బాలింతలు బలవర్ధకమైన ఆహారం తీసుకున్నప్పుడే పుట్టే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు దీపక్ అన్నారు. శనివారం పెదకూరపాడులోని సామాజిక ఆరోగ్య కేంద్రం, 75త్యాళ్ళూరు పీహెచ్‌సీలో పరీక్షలకు వచ్చిన గర్భిణులు, బాలింతలకు స్థానిక మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఫౌండేషన్ నిర్వాహకులు మాగులూరి కృష్ణారావు, కుంచనపల్లి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి నెల 9న బవర్ధకమైన ఆహారం అందిస్తున్నామన్నారు.

# ‘సిద్ధం’ సభకు వేలాదిగా తరలిరండి



సిద్ధం పోస్టర్లను విడుదల చేస్తున్న కళ్యాణ్ చక్రవర్తి

**బెల్లంకొండ:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం మేదరమెట్ల వద్ద నిర్వహించనున్న సిద్ధం సభకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి పార్టీ కార్యకర్తలు వేలాదిగా తరలిరావాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తనయుడు కల్యాణ్ చక్రవర్తి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో ‘సిద్ధం’ సభ విజయవంతానికి సమావేశం నిర్వహించారు. ప్రజల కోసం నిత్యం శ్రమించే నాయకుడు ప్రజల్లోకి వస్తే వారి అభిమాన ఎలా ఉంటుందో ప్రజలు చూపిస్తున్నారన్నారు. మండలం నుంచి భారీ ఎత్తున హాజరై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు తెలుపుదామని ఆయన పిలుపునిచ్చారు. అనంతర ం సిద్ధం సభ పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ గాదె వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీలు మరియదాసు, అహ్మద్ పాషా, సొసైటీ చైర్మన్ భద్రయ్య, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

# నేటి సమాజానికి స్ఫూర్తి మహిళ



వైద్యాధికారి సిరి చందనను సత్కరిస్తున్న ఉద్యోగులు

**క్రోసూరు:** నేటి సమాజానికి స్ఫూర్తి, రేపటి సమాజానికి వెలుగు మహిళ అని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పల్నాడు జిల్లా క్రోసూరు తాలూకా యూనిట్ అధ్యక్షుడు శిఖా శాంసన్ అన్నారు. మండలంలోని దొడ్లేరులో శనివారం ఏపీజీఈ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాంసన్ మాట్లాడుతూ మహిళ అమ్మగా జన్మనిస్తుందని, భార్యగా బాధ్యతలను మోస్తుందని, అక్కగా కష్టాల్లో తోడుగా నిలుస్తుందన్నారు. వైద్యాధికారి సిరి చందన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సిరి చందనను సత్కరించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

### సీహెచ్‌సీలో ఇక మేజర్ ఆపరేషన్లు



**సత్తెనపల్లి:** సత్తెనపల్లి ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో ఎముకల ఆపరేషన్ నిర్వహించడానికి (సీ–ఏఆర్ఎం) ఆపరేషన్ ఎక్విప్‌మెంట్ ప్రభుత్వం శనివారం సరఫరా చేసింది. వీటి విలువ సుమారు రూ.30 లక్షలు ఉంటుంది. సత్తెనపల్లి ఏరియా వైద్య శాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ డాక్టర్ కొత్త రామకృష్ణ మాట్లాడుతూ త్వరలోనే ఈ మెషీన్‌ను ఆపరేషన్లలో ఉపయోగిస్తామన్నారు. ఇప్పటిదాకా ఎముకలు విరిగిన వారికి చిన్న చిన్న ఆపరేషన్‌లు మాత్రమే ఇక్కడ జరిగేవని, ఇక నుంచి మేజర్ ఆపరేషన్లు కూడా చేస్తామన్నారు. దీనికి సహకరించి, ప్రత్యేక శ్రద్ధ చూపించిన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వైద్యశాల సూపరింటెంట్ డాక్టర్ లక్ష్మణరావు, గైనకాలజిస్ట్ డాక్టర్ సుజాత, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ, సూపర్‌వైజర్ శ్రీనివాస్ ఉన్నారు.

**నేడు ఇళ్ల రిజిస్ట్రేషన్**

**రాజుపాలెం:** రాజుపాలెం, బ్రాహ్మణపల్లి, పెదనెమలిపురి గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆదివారం నిర్వహించనున్నట్లు తహసీల్దారు ఎస్.హరిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు ఆయా గ్రామ సచివాలయాలకు వెళ్లి ఈకేవైసీ వేసి, రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పేర్కొన్నారు.

### మాజీ కౌన్సిలర్ మృతి

**సత్తెనపల్లి:** వైఎస్సార్ సీపీ 29వ వార్డు మాజీ కౌన్సిలర్ షేక్ మహబూబీ అలియాస్ బాబులమ్మ (70) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందారు. ఆమెకు భర్త మౌలాలి ఉన్నారు. వైఎస్సార్ సీపీ నుంచి 29వ వార్డు కౌన్సిలర్‌గా గెలుపొంది 2014 నుంచి 2019 వరకు ఆమె సేవలందించారు. మహబూబీ సోదరుడు కరీముల్లా గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర జలవనుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### పరీక్ష సామగ్రి పంపిణీ



**క్రోసూరు:** స్థానిక కేజీబీవీ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు ఎస్‌సీఎం సభాని సౌజన్యంతో హెల్ప్ ఫౌండేషన్ సభ్యులు పరీక్ష సామగ్రిని శనివారం పంపిణీ చేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ నేటి సమాజంలో చదువుకున్న వారికే విలువ ఉందన్నారు. బత్తుల అనూష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జేబీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా చిరంజీవి

**పెదకూరపాడు:** జై భీమ్ రావ్ భారత్ పార్టీ పెదకూరపాడు అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థిగా లింగంగుంట్ల గ్రామానికి చెందిన సారెకుక్క చిరంజీవిని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జడ శ్రావణ్ కుమార్ శనివారం ప్రకటించారు. పెదకూరపాడులో పల్నాడు జిల్లా జేబీపీ అధ్యక్షుడు జోన్నలగడ్డ విజయ్‌కుమార్, ఎమ్మెల్యే అభ్యర్థి చిరంజీవి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా తొలి జాబితాల్లో 61 మంది అసెంబ్లీ అభ్యర్థులు, ఏడు లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించామన్నారు. బహుజనులకు రాయితీలు కాదని, అధికారంలో భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మహంకాళి వెంకట్రావు, సారెకుక్క రత్నం, చిట్టెమ్మ, బందెల జగన్నాథం, మొండితోక యోహాషువా, అనుమాల కోటేశ్వరరావు, కోటేశ్వరమ్మ, ప్రశాంత్ పాల్గొన్నారు.



**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.